సాక్షి తిరుపతి

శుక్రవారం । 13 । జనవరి । 2023

I



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,790
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,162
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,100
రిటైల్ వెండి గ్రాము	రూ.72.10

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	32	16
చిత్తూరు	31	16
తిరుమల	26	11
గూడూరు	31	18
నగరి	32	17



26న అక్షరాభ్యాసం

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈ నెల 26న ప్రత్యేక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు.

న్యూస్‌రీల్

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

తిరుపతి అర్బన్: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈమేరకు శిశుసంక్షేమశాఖ వారితో పాటు పొదుపు సంఘాల వారి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఉద్యోగులతో మాట్లాడారు. ప్రధానంగా ఆరోగ్యకేంద్రాలు అన్ని మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. 10 నుంచి 19 సంవత్సరాల బాలికలు, గర్భిణీ స్త్రీలు అనీమియా బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా అధికారులను ఆదేశించారు. డీఆర్వో శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకరనారాయణ, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, డీఎల్‌డీఓ సుశీలాదేవి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, సీపీఓ అశోక్‌కుమార్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

16 నుంచి ముఖ ఆధారిత హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు ముఖఆధారిత హాజరును ఈనెల 16వ తేదీ నుంచి తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా అధికారులతో హాజరు నిర్వాహణపై ఆయన సమీక్షించారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ఈనెల 1వ తేదీ నుంచి జిల్లా అధికారులు, ఈనెల16వ తేదీ నుంచి సిబ్బంది తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పారు. ఏపీఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ డౌన్‌లోడ్ విధానంలో ఇబ్బందులు తలెత్తితే ఎన్‌ఐసీ అధికారులను (7013364471) సంప్రదించాలని సూచించారు. డీడీఓగా ఉన్న అధికారులు తమ సిబ్బంది పనిచేసే ప్రదేశాల జియోగ్రాఫికల్ లొకేషన్ అసైన్ చేయాల్సి ఉంటుందన్నారు. డీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు. .

టీటీడీ ట్రస్టులకు రూ.60 లక్షల విరాళం



డీడీని అందజేస్తున్న దాతలు

తిరుమల: టీటీడీ లోని వివిధ ట్రస్టులకు తెలంగాణకు చెందిన నితిన్‌సాయి ఇండియా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.60 లక్షలు విరాళంగా అందించింది. సంస్థ అధినేత, మాజీ శాసనసభ్యుడు జి.సూర్యనారాయణ తరఫున ఆయన కుమారుడు నితిన్‌సాయి తిరుమలలో డోనార్ సెల్ ఇన్‌చార్జి డెప్యూటీ ఈవో సెల్వంకు విరాళం డీడీలను అందజేశారు. ఎస్వీ అన్నప్రసాదం, గోసంరక్షణ, బర్డ్, సర్వశ్రేయ, పురా తన ఆలయాల పరిరక్షణ ట్రస్టు, కాటేజీ నిర్మాణం కోసం రూ.10 లక్షలు చొప్పున విరాళం అందించారు.



ముగ్గు వేస్తున్న యువతి



కొనుగోలుదారులతో కిక్కిరిసిన గాంధీరోడ్డు



కిటకిటలాడుతున్న తీర్థకట్ట వీధి

పండగ వాతావరణం

మంచుతెరలు.. గొబ్బెమ్మల లోగిళ్లు.. చూడచక్కని రంగవల్లులు.. డూడూ బసవన్నలు.. అబ్బో! తిరుపతిలో గురువారం పండగ వాతావరణం నెలకొంది. ఈనెల 14, 15, 16 తేదీలలో మూడు రోజుల పాటు సంక్రాంతిని పురస్కరించుకుని పండుగకు కావాల్సిన సరంజామా కొనుగోలు చేసేందుకు ప్రజానీకం పెద్ద ఎత్తున తరలివచ్చింది. గాంధీవీధి, తీర్థకట్ట వీధి, వీవీమహల్ రోడ్డు కిక్కిరిసిపోయింది. మరికొన్ని చోట్ల ముందస్తు సంక్రాంతి సంబరాల్లో యువత మునిగితేలింది. ముగ్గులు వేస్తూ, గొబ్బెమ్మలు పెడుతూ సందడి చేసింది. – తిరుపతి కల్చరల్

అంతర్మథనం.. అగ్గిమీద గుగ్గిలం!



- అభ్యర్థిత్వాల నాన్చుడు ధోరణిపై రగిలిపోతున్న నేతలు
- పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్టుగా ఉన్న ఆశావహులు
- ఉన్నపైసా పోగొట్టుకుంటే పరిస్థితి ఏంటనే మీమాంస
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇదీ పరిస్థితి

టీడీపీ అధిష్టానం తీరుపై ఆ పార్టీ ఆశావహులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవులతో సరిపెట్టడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఒకటిరెండు నియోజకవర్గాలకు అభ్యర్థిత్వాలు ప్రకటించి మిగిలిన వాటిని పట్టించుకోకపోవడంపై రగిలిపోతున్నారు. ఇతర పార్టీతో పొత్తులు పెట్టుకుంటే తమ పరిస్థితి ఏంటని మదనపడుతున్నారు. పార్టీ జెండా మోసిన తమను పక్కనబెడితే కష్టాలు తప్పవని కుమిలిపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీడీపీ పరిస్థితి అయోమయంలో పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలువురు పోటీపడుతున్నట్టు పైకి చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని స్పష్టమవుతోంది. ఇన్నాళ్లు టిక్కెట్ వస్తుందనే ఆశతో కష్టాలకోర్చినా చివరకు మొండిచెయ్యి మిగులుతుందేమోనన్న బాధ ఆ పార్టీ నేతలను వెంటాడుతోంది. ఈ పథ్యంలోనే అధినేత చంద్రబాబు నాయుడు నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించి అభ్యర్థిత్వాలపై నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది.

ఎందుకు నాన్చుడు బాబు?

ఉమ్మడి జిల్లాలో టీడీపీ ఆశావహులు ఎవరికివారే యమునాతీరే అన్న చందంగా ఉంటున్నారు. ఇన్నాళ్లు జెండా మోసిన నేతలు అధిష్టానం తీరుపై గుర్రుగా ఉంటున్నారు. ఉన్నపైసా పోగొట్టుకుని చతికిలపడడంకంటే మిన్నకుండడమే మేలనే అభిప్రాయానికి వచ్చినట్టు ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. ఈ క్రమంలో తిరుపతి నగరంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి, జేబీ శ్రీనివాసులు బరిలో నిలిచేందుకు పోటీపడుతున్నట్టు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి లేదని చర్చించుకుంటున్నారు. టీడీపీతో పొత్తు కుదిరితే జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, కిరణ్‌రాయల్, లేదంటే పవన్‌కల్యాణ్‌లో ఎవరో ఒకరు పోటీచేస్తే పరిస్థితి ఏంటనే మీమాంసలో పడినట్టు చెబుతున్నారు. ఇక చంద్రగిరి విషయానికి వస్తే.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తినానికే టిక్కెట్ అని చంద్రబాబు స్పష్టం చేసినా ఆయన మాత్రం వెనకడుగు వేస్తున్నారు. చిత్తూరు టిక్కెట్ ఇవ్వమని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. శ్రీకాళహస్తి నుంచి బొజ్జల సుధీర్‌రెడ్డి, రష్ ఆస్పత్రి అధినేత సిపాయి సుబ్రమణ్యం పేర్లు వినిపించినా వారిరువూ సుముఖంగా లేరని పేర్కొంటున్నారు. వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, హైదరాబాద్‌లో స్థిరపడ్డ వెంకటగిరి వాస్తవ్యుడు బొలిగల మస్తాన్ యాదవ్ పేర్లు వినిపించినా ఎన్నికల్లో పోటీ చేయడానికి మాత్రం వారు సాహసించడం లేదని అంటున్నారు. సూళ్లురుపేట కోసం నెలవల సుబ్రమణ్యం, పరసా వెంకటరత్నం, అల్లుడు సతీష్‌చంద్ర టిక్కెట్ ఆశిస్తున్నా.. వీరిలో ఇప్పటి వరకు ఎవరి పేర్లూ ఖరారు చేయకపోవడంతో అయోమయం నెలకొన్నట్టు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. సత్యవేడు నుంచి మాజీ ఎమ్మెల్యేలు హేమలత, తలారి ఆదిత్య, జేడీ రాజశేఖర్ టికెట్ కోసం పోటీ పడుతున్నారని చెప్పుకుంటున్నా... వాస్తవంగా వీరెవ్వరూ ఎన్నికలకు సిద్ధంగా లేరని అక్కడి నేతలు చెవులు కొరుక్కుంటున్నారు. గూడూరు నుంచి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మిభర్త క్రిష్ణయ్య టిక్కెట్ కోసం పోటీ పడుతున్నారని చెబుతున్నా... క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని అంటున్నారు.

మేం కనిపించలేదా బాబూ?

కుప్పం నుంచి చంద్రబాబు, పలమనేరు నుంచి మాజీ మంత్రి అమరనాథరెడ్డి అభ్యర్థిత్వాలు ఖరారు చేసుకుని మిగిలిన వారి పేర్లు ప్రకటించకపోవడాన్ని ఆ పార్టీ సీనియర్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. చిత్తూరు పులివర్తినాని, మాజీ మేయర్ కఠారి హేమలత, మాజీ ఎంపీ డీకే ఆదికేశవులు నాయుడు కుటుంబం ఎదురుచూపులు ఎండమావులుగా మిగిలిపోతున్నాయని ఆ నియోజకవర్గ నేతలు మండిపడుతున్నారు. పుంగనూరు నుంచి చల్లా రామచంద్రారెడ్డికి టికెట్ ఖరారు చేసినా.. జనసేనతో పొత్తు కుదిరితే రామచంద్రయాదవ్ టిక్కెట్ ఎగరేసుకుపోయే అవకాశాలు ఉన్నట్టు ఆ పార్టీ నేతలు చెబుతుండడంతో అక్కడివారు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఇక గంగాధరనెల్లూరు, పూతలపట్టు అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసేందుకు ఏఒక్కరూ ముందుకు రాకపోగా.. నగరిలో మాజీ మంత్రి ముద్దుకృష్ణమనాయుడు కుమారులు గాలి భానుప్రకాష్, గాలి జగదీష్, మాజీ ఎమ్మెల్సీ గాలి సరస్వతి, సిదార్థ విద్యాసంస్థల చైర్మన్ అశోక్ రాజ్ ఆశలు అడియాశలయ్యే అవకాశం ఉన్నట్టు అక్కడి నేతలు చర్చించుకుంటున్నారు. ఇలాంటి దానికి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని.. విమర్శలు ఎదుర్కోవడం ఎందుకని ఆయా నియోజకవర్గాల నేతలు అంటీముట్టనట్టుగా ఉండిపోతున్నారు.

వెంకటగిరి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



నేదురుమల్లిని సత్కరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వెంకటగిరి: వెంకటగిరి అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారిస్తామని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక మెజారిటీతో వెంకటగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసేలా కృషిచేస్తామన్నారు.

కౌన్సిల్ సభ్యులకు సమప్రాధాన్యం

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంకటగిరి మున్సిపాలిటీలోని 25 వార్డుల కౌన్సిలర్‌లకు సమప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. అంతకుముందు బాలాయపల్లికి చెందిన సినీనిర్మాత ప్రసాద్‌చౌదరి నేదురుమల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు. బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, సీనియర్‌నేతలు చెలికం శంకరరెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, పులిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కడప బ్రహ్మయ్య, చిట్టేటి హరికృష్ణ, సొసైటీ అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి, నాగయ్య, ఎస్ వేణునాయుడు, ఆర్ దేవికాచౌదరి తదితరులు పాల్గొన్నారు.

16న గోపూజ మహోత్సవం

తిరుపతి రూరల్: స్థానిక శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఈనెల 16వ తేదీ కనుమ పండుగ సందర్భంగా గోపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు టీటీడీ అధికారులు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక సంగీత, సాహిత్య కార్యక్రమాలు ఉంటాయన్నారు. గోపూజ మహోత్సవం రోజున గోవులకు బెల్లం, బియ్యం, గ్రాసం భక్తులు స్వయంగా తినిపించవచ్చని పేర్కొన్నారు.

విప్లవాత్మక పాలన సీఎం జగన్ సొంతం

- ఇతర రాష్ట్రాలకు ఆదర్శం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బ్యాంకు లింకేజీ రుణాల చెక్ అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం(చిత్తూరు జిల్లా): గొప్ప విప్లవాత్మక ఆలోచనలతో పారదర్శక పాలన అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. మండలంలోని ఐదు పంచాయతీల పరిధిలో గురువారం ఆయన పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. 36 మహిళా సంఘాలకు రూ.5.62 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక గొప్ప ఆలోచనలతో జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఇతర రాష్ట్రాల సీఎంలకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలియజేశారు. నాడు–నేడు, అమ్మ ఒడి, విద్యాదీవన, విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద లాంటి పథకాలతో ప్రజలకు అవసరమైన విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటయ్యాక ప్రజల నుంచి ఫిర్యాదులు సైతం తగ్గిపోయాయని తెలిపారు. అనేక సమస్యలకు స్థానికంగానే, సత్వరమే పరిష్కారం లభిస్తోందన్నారు. ఆర్బీకేలు, వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. దళారీ వ్యవస్థకు తావు లేకుండా పథకాలను పారదర్శకంగా అమలుచేస్తున్నట్టు వివరించారు. సంక్షేమ పథకాల కొనసాగింపునకు ప్రజలు మళ్లీ జగన్‌కే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు, అనంతపురం ఎంపీలు రెడ్డెప్ప, తలారి రంగయ్య, టీడీపీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎమ్మార్సీ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి

కంభంవారిపల్లె పంచాయతీ కురవపల్లెకి చెందిన 18 మంది టీడీపీ నాయకులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, మంత్రి నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. పార్టీకోసం కష్టపడే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని, తాను అండగా ఉంటానని మంత్రి స్పష్టం చేశారు.

18 నుంచి పునఃశ్చరణ తరగతులు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వర్సిటీ వీసీ రాజారెడ్డి తదితరులు

తిరుచానూరు: ఎస్వీయూనివర్సిటీలోని బాటనీ విభాగంలో ఈనెల 18 నుంచి 31వ తేదీ వరకు అధ్యాపకులకు బాటనీశాఖ పునఃశ్చరణ తరగతులు నిర్వహించనున్నట్టు వర్సిటీ వీసీ కే.రాజారెడ్డి తెలిపారు. ఈమేరకు గురువారం ఎస్వీయూలోని వీసీ చాంబర్‌లో బాటనీశాఖ పునఃశ్చరణ తరగుతల బ్రోచర్లను ఆయన రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బయాలజీ ఇన్ 21 సెంచరీ ఆస్పెక్ట్స్ అండ్ ప్రాస్పెక్ట్స్ అనే అంశాలపై జరిగే ఈ తరగతులను అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కోర్సుకు డైరెక్టర్‌గా ఆచార్య సి.మోహనాచారి, కన్వీనర్‌గా డాక్టర్ నాగలక్ష్మీదేవమ్మ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో బాటనీ శాఖాధిపతి ఆచార్య సావిత్రమ్మ, డీన్ ఆచార్య దామోదరంరెడ్డి పాల్గొన్నారు.

తిరుపతికి సెవన్‌స్టార్ రేటింగ్ సాధనే లక్ష్యం



అనుపమ అంజలి, కమిషనర్

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగరానికి సెవన్‌స్టార్ రేటింగ్ సాధించడమే లక్ష్యమని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి స్పష్టం చేశారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వచ్ఛతలో గత ఏడాది అత్యద్భుత ర్యాంకులు సాధించామని, ఈ సారి నగర ప్రజలు మరింత సహకారం అందిస్తే సెవన్‌స్టార్ రేటింగ్ సాధించి తీరుతామని స్పష్టం చేశారు. ప్రజలు ఇంటివద్దే తడి, పొడి చెత్తను వేరుచేసి సిబ్బందికి అందించాలన్నారు. ఈనెల 18వ తేదీన అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. అదేరోజున వినాయకసాగర్ వద్ద నిర్మించిన ఐదు ఎంఎల్ సామర్థ్యంగల మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

ఈకేవైసీ వేగవంతం చేయండి

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పత్రాల పంపిణీకి సంబంధించిన ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని జేసీ డీకే బాలాజీ పేర్కొన్నారు. గురువారం జిల్లా అధికారులతో ఆయన రీసర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పత్రాల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. రెండవ దశ రీసర్వేకు సంబంధించి 11 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. సర్వే ప్రక్రియలో భాగంగా మ్యూటేషన్ కోసం అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఉద్యోగులు, పెన్షన్‌దారులు..

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ఖజానా అధికారి లక్ష్మీకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. ప్రతి ఉద్యోగి సీఎఫ్‌ఎంఎస్ ఐడీ ద్వారా ఈకేవైసీ చేసి.. ఆధార్‌కార్డుకు ఫోన్ నంబర్ లింక్‌తో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

సామాన్య భక్తులకు సకల సౌకర్యాలు



అద్దె గదులను పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ

తిరుమల: తిరుమల, తిరుపతిలో సామాన్య భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్టు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వామివారి దర్శనానికి వచ్చే పేద, మధ్యతరగతి, ధనిక వర్గాలతో సహా ప్రతి ఒక్కరికీ పైసా ఖర్చులేకుండా ఉచిత భోజనం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

- తిరుమలలోని ఐదు పీఏసీల్లో దాదాపు 7,400 లాకర్లలో సుమారు 15 వేల మందికి పైగా భక్తులకు టీటీడీ ఉచితంగా బస
- మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో రోజుకు లక్ష మంది ఉచితంగా భోజనం.
- పాత అన్నదాన భవనంలో కూడా అన్నదాన కార్యక్రమం ప్రారంభం.
- తిరుమలలోని అశ్వనిఆస్పత్రి, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లలోని డిస్పెన్సరీల ద్వా రా ఉచిత వైద్యం. అపోలో కార్డియాక్ సెంట ర్ ద్వారా గుండె సంబంధిత అత్యవసర వైద్యం.
- వృద్ధులు, నడవలేని వారి కోసం బ్యాటరీ వాహనాలు.
- లగేజీ, సెల్‌ఫోన్ డిపాజిట్ కేంద్రాల కోసం ఏడాదికి రూ.30 కోట్ల వ్యయం.
- చిన్న పిల్లలకు ఉచితంగా ఆధునిక వైద్యం అందుబాటులోకి తేవడానికి రూ.320 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం.
- రూ.50, రూ.100 కనీస అద్దెకే గీజర్, మంచం, పరుపు ఉండే గదులు కేటాయింపు.
- బర్డ్, స్విమ్స్, ఆయుర్వేద, చిన్నపిల్లల గుండె చికిత్సల ఆస్పత్రుల నిర్వహణ. లక్షలాది మంది రోగులకు ఉచిత, రాయితీలతో కూడిన మెరుగైన వైద్యం.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం

- టీడీపీ ప్రభుత్వంలో కరువు కాటకాలు
- జగనన్న హయాంలో సమృద్ధిగా వర్షాలు
- ఎంపీ, ఎమ్మెల్యే వెల్లడి



ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి

నాయుడుపేట టౌన్: విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తిరుపతి ఎంపీ గురుమూర్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా కట్టా బాలసుబ్రహ్మణ్యం, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు సీఎం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో రైతులు కరువు కటకాలతో బాధపడ్డారని, జగనన్న సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రోజు నుంచి సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. గత రెండున్నరేళ్లలో స్థానిక ఏఎంసీ పాలనలో రైతుల సంక్షేమంతో పాటు వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.10 కోట్లాకు పైగా ఖర్చుచేసినట్టు వెల్లడించారు. నాయుడుపేట కేంద్రంలోని ఏఎంసీ గోదాములతో పాటు మూడు మండలాల్లో 500 మేట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల నిర్మాణం, అగ్రిల్యాబ్‌ల ఏర్పాటు జరుగుతోందన్నారు. ఎంపీ మాట్లాడుతూ రైతులను రాజులుగా చూడలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. అందరి సంక్షేమ కోసం పాటు పడుతున్న జగనన్నను మరింతగా ఆదరించాలని పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లా ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిశీలకులు పాశెం సు . దీర్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణస్వీకారం

మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా సాగింది. మార్కెట్ కమిటీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కట్టా బాలసుబ్రహ్మణ్యం చేత వేర్వురుగా తిరుపతి జిల్లా అగ్రిటెక్ ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి టీ సురేంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. అదే విధంగా ఏఎంసీ సభ్యులుగా నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన గుండాల సురేష్‌రెడ్డి, పట్టుకోటరఘు, చప్పిడి దిలీప్, బట్టికల కృష్ణయ్య, పాకనాటి ప్రవీణ, లోక్కు జ్యోతి, గజ్జాల సుబ్బారాయులు, కన్నలి భారతి, అద్దురు చెంగమ్మ, కట్టాంరెడ్డి సాయి తేజ, నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక, కురుగొండ సోసైటీ అధ్యక్షరాలు ఉచ్చూరు శోభారాణిచేత సంయుక్తగా ప్రమాణస్వీకారం చేయించారు. అంతముందు ఎంపీ, ఎమ్మెల్యే, ఏఎంసీ చైర్మన్, నాయకులకు క్రేన్ సహాయంతో తంబిరెడ్డి అభిమానులు భారీ గజామాలతో స్వాగతించారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎంఆర్ సంస్థల డైరెక్టర్‌లు తంబిరెడ్డి మోహన్‌రెడ్డి హేమకుమార్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నేతలకు గజ సత్కారం

16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఒకరి అరెస్ట్

తిరుపతి అలిపిరి: తిరుపతి సమీపంలోని పాపానాయుడుపేట వద్ద వేర్లతోసహా పెకిలించిన 16 ఎర్ర చందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టుచేశారు. కర్నూలు రేంజి డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి సూచనలతో కడప ఆర్ఐ ఎం.చిరంజీవులు, ఆర్ఎస్ఐ నరేష్ బృందం బుధవారం తిరుపతి జిల్లా ఏర్పేడు నుంచి కేవీబీపురం వైపు కూంబింగ్ చేపట్టారు. గురువారం ఉదయం తిరుపతి రేంజ్ పాపానాయుడుపేట బీట్ పరిధిలోని చెల్లూరు పరిధిలోని ఇరగలప్పస్వామి ఆలయం వద్ద కొందరు వ్యక్తులు తారసపడ్డారు. సిబ్బంది సమీపించేసరికి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరు పట్టుబడగా మిగిలివారు తప్పించుకెళ్లారు. పట్టుబడ్డ వ్యక్తి చెల్లూరు పోస్టు, గుల్లకండ్రిగ గ్రామానికి చెందిన ఆవులూరి పద్మనాభం (41)గా గుర్తించారు. అతనిని అరెస్టుచేసి సమీపంలో ఉన్న 16 ఎరచ్రందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసి సీఐ చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు. పారిపోయిన వారిని త్వరలో పట్టుకుంటామన్నారు.



స్వాధీనం చేసుకున్న ఎరచ్రందనంతో పాటు ముద్దాయిని చూపుతున్న పోలీసులు

యువతకు స్ఫూర్తి వివేకానంద



నివాళులర్పిస్తున్న విగ్రహదాత పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు



ఎంబీయూ ప్రోచాన్స్‌లర్ మంచు విష్ణుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

- ఎంబీయూ చాన్స్‌లర్ మంచు విష్ణు

చంద్రగిరి: నేటి తరం యువతకు స్ఫూర్తి ప్రదాతగా చరిత్రలో నిలిచిన వ్యక్తి స్వామి వివేకానంద అని మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) చాన్స్‌లర్ మంచు విష్ణు అన్నారు. గురువారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంబీయూలోని డిగ్రీ కళాశాలలో యువజనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద భారతీయ యువతకు ఒక దిక్సూచి అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచి ప్రపంచానికి దిశ నిర్దేశం చేయాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత కీలకమన్నారు. అనంతరం చాన్సలర్ మోహన్‌బాబు, వీసీ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి విద్యార్థులను అభినందించారు.

బాలికోన్నత పాఠశాలలో...

స్థానిక చంద్రగిరి కొత్తపేటలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, విగ్రహదాత పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ముదికుప్పం రామమూర్తి, కిషోర్, కొత్తపాటి హరి, పీడీలు హరి, నరసింహారెడ్డి, రూప, శ్రీనివాసులు, శ్రీమన్నారాయణరెడ్డి, శ్రీను, రూపకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలుచేస్తే కఠిన చర్యలు

- జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి హెచ్చరిక
- ప్రైవేట్ బస్సుల్లో ప్రత్యేక బృందాల తనిఖీ



ప్రైవేటు బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖాధికారి శ్రీనివాసరావ్, సిబ్బంది

తిరుపతి మంగళం : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల నుంచి ప్రైవేటు బస్సుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి హెచ్చరించారు. గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు, ప్రత్యేకించి తిరుపతి నుంచి హైదరాబాద్, చెన్నై బెంగళూరు, విజయవాడ వంటి నగరాలకు వెళ్లాడానికి, ఆ ప్రాంతాల నుంచి ఇక్కడకు రావడానికి ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయరాదని ఆదేశించారు. వాటి నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అధిక చార్జీలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తాము ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నిత్యం రహదారులలో నిఘా ఉంటాయని, ఎప్పటికప్పుడు బస్సులను తనిఖీ చేస్తుంటారన్నారు. అసాధారణ చార్జీలతో ప్రయాణికులను దోచుకున్నా, అవకతవకలకు పాల్పడినా కేసులు నమోదు చేసి బస్సు సీజ్ చేయడంతో పాటు కఠినన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేక బృందాలే ఈనెల 17వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేటు బస్సులపై మూడు అధిక చార్జీల వసూలు కేసులు, మరో 20 ఇతర నిబంధనల అతిక్రమణ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రైవేటు బస్సుల్లో ఎవరైనా అధిక చార్జీలు వసూలు చేస్తే 9966331142 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఆన్‌లైన్ రాహు-కేతు పూజల పేరిట దోపిడీ

శ్రీకాళహస్తి: ఆన్‌లైన్ రాహు-కేతు పూజల పేరిట భక్తులను మోసం చేసిన ఘటన గురువారం వెలుగు చూసింది. దేవస్థానం అధికారులు, పోలీసుల కథనం.. శివస్వామి దీక్షిత్ అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రం, నిజమాబాద్‌కు చెందిన సతీష్‌రెడ్డికి ఫోన్ చేసి రూ.19 వేలు చెల్లిస్తే ఆన్‌లైన్ రాహు-కేతు పూజ చేయిస్తామని నమ్మబలికాడు. అతను చెప్పిన విధంగా సతీష్‌రెడ్డి కుటుంబం ఆన్‌లైన్ పేమెంట్ చేసింది. ఆపై గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చి విచారణ చేయగా అలాంటిది ఏమీ లేదని చెప్పడంతో ఖంగుతిన్నారు. తర్వాత పాలకమండలి చైర్మన్‌కు, అక్కడి నుంచి వెళ్లి 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారుణ చేపట్టారు.

శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

వరదయ్యపాళెం: భారత్ దర్శక్ స్టడీ టూర్‌లో భాగంగా 2022 బ్యాచ్‌కు చెందిన 20 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీలోని ఫాక్స్‌కాన్ మొబైల్ పరిశ్రమ, ఆల్‌స్తామ్ పరిశ్రమలను పరిశీలించారు. వీరికి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి శ్రీసిటీలో అభివృద్ధి చెందిన ప్రపంచశ్రేణి మౌలిక వసతులు, ప్రత్యేకతలను వివరించారు. శ్రీసిటీలో వ్యాపార అనుకూల వాతావరణం అద్భుతమని ట్రైనీ ఐఏఎస్‌ల బృందం లీడర్ చిరంజీవ్ ఆనంద్ తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. వీరి పర్యటన పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో సంతోషం వ్యక్తంచేశారు.



శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



త్యాగరాజస్వామి వారి పంచరత్న కృతుల బృందగానం ఆలపిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్: వాగ్గేయకార చక్రవర్తి సద్గురు త్యాగరాజ స్వామికి సంగీత కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సంకీర్తనలతో ఘన నీరాజనాలు అందించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో గురువారం త్యాగరాజస్వామి వారి 176వ ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్ విచ్చేసి ప్రసంగించారు. త్యాగరాజస్వామి పంచరత్న కృతులను ప్రతి ఒక్కరూ నేర్చుకుని, రాబోవు తరాలకు అందించాలన్నారు. ప్రతి కుటుంబంలో ఒక్కరైనా సంగీతం, సాహిత్యం, నృత్యం నేర్చుకోవడంతో ఆ కుటుంబాలు సుఖ సంతోషాలు, సౌభాగ్యా లతో ఉంటాయని చెప్పారు. దీనికి ముందు కళాశాల ప్రాంగణంలోని శ్రీవిఘ్నేశ్వర, హనుమత్ సమేత సీతారామలక్ష్మణులకు, శ్రీవేంకటేశ్వర స్వామి వారికి, శ్రీత్యాగరాజస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నాదస్వర పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు మంగళవాయిద్య నీరాజనం సమర్పించారు.

పంచరత్న కృతుల బృందగానం

తమిళనాడులోని తిరువయ్యారు తరహాలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆలపించిన శ్రీత్యాగరాజస్వామివారి ఘనరాగ పంచరత్న కృతుల బృందగానం సంగీత ప్రియులను ఓలలాడించింది. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి, డెప్యూటీ ఈవో గోవిందరాజన్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్ విభీషణ శర్మ, ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్, కళాశాల అన్ని విభాగాల అధ్యాపకులు, స్థానిక సంగీత విద్వాంసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితుల కోసం డిఫెన్స్ కౌన్సిల్ ఏర్పాటు

చిత్తూరు అర్బన్: క్రిమినల్ కేసుల్లో జైలులో ఉంటున్న, బెయిల్‌పై వచ్చిన ఆర్థిక స్తోమత లేని నిందితుల కోసం సుప్రీం కోర్టు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను ఏర్పాటుచేసినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాది సి.భానుశేఖర్‌రెడ్డితో కలిసి చిత్తూరు నగరంలోని పాత జిల్లా కోర్టు లోని లీగల్ ఎయిడ్ డెఫెన్స్ కౌన్సిల్ సిస్టం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వివిధ కోర్టుల్లో అనుభవం కలిగిన ముగ్గురు న్యాయవాదులను జాతీయ లీగల్ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించినట్టు పేర్కొన్నారు. ఇందులో ఉచిత న్యాయ సహాయ ముఖ్య న్యాయవాదిగా సి.భానుశేఖర్ రెడ్డి, ఉచిత న్యాయ సహాయ అదనపు న్యాయవాదిగా జి.మధుసూదన్, ఉచిత న్యాయ సహాయ అసిస్టెంట్ న్యాయవాదిగా సాయి గీత నియమితులయ్యారని వివరించారు. వీరు జిల్లా కేంద్రంలోని మెజిస్ట్రేట్ కోర్టు, అసిస్టెంట్ సెషన్స్ కోర్టు, జిల్లా కోర్టులో వివిధ క్రిమినల్ కేసులను వాదిస్తారని వెల్లడించారు. ఆర్థిక స్తోమత లేని వారు పాత జిల్లా కోర్టులోనే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం కార్యాలయంను ఆశ్రయించాలని తెలిపారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ్ కుమార్

అవసరమైన విడిభాగాలు సిద్ధం చేయండి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ సర్వీసులను మరమ్మతులు చేయించడానికి అవసరమైన విడిభాగాలను సిద్ధంగా గ్యారేజ్‌లో ఉంచాలని బహుజన ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు అంజప్ప, దేవరాజులు డిమాండ్ చేశారు. ఆ మేరకు డీపీటీవో చెంగల్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. డీజిల్ ఆదా చేయాలంటూ అధికారులు ఒత్తిడి చేయరాదని సూచించారు. పని ఒత్తిడి తగ్గించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. తప్పకుండా న్యాయబద్ధమైన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెంగల్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు.